

జిల్లాలో 42.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

ఆసిఫాబాద్, మార్చి 29: జిల్లాలో శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే జిల్లాలో 42.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసుకొని మూడో స్థానంలో ఉంది. ఆసిఫాబాద్ మండలంలో 42.5, రెబ్బెనలో42.3 తిర్యాణిలో41.5కెరమెరిలో 41.4, సిర్పూర్(టి), కాగజ్‌నగర్‌లలో 40.9, పెంచికల్ పేటలో 40.4, వాంకిడిలో 40.0 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కెరమెరి, మార్చి 29: మండలకేంద్రంలోని సాకడ క్రాస్‌రోడ్డులో శుక్రవారం ఏఎస్సై బాల్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్- ఆదిలాబాద్ ప్రధానరహదారి, అలాగే సాంగ్వీ, మహారాష్ట్రలోని జివితికి వెళ్లే ద్విచక్ర వవాహన దారులను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నేడు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

సిర్పూర్(టి), మార్చి 29: మండల కేంద్రంలోని ఎంపీ డీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ సువర్ణపై అవిశ్వాస తీర్మాన సమావేశం ఉందని కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్‌కుమార్ సభ్యులకు నోటీసులు జారీచేశారు. నేడు 11.30గంటలకు అవిశ్వాస సమావేశం నిర్వహిస్తున్నట్లు సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

మిగిలింది రెండు రోజులే

- ఆస్తి పన్ను వసూలు టార్గెట్ రూ.3.66 కోట్లు
- ఇప్పటివరకు వసూలు చేసింది రూ.2.18 కోట్లు
- ఇంకా వసూలు కావాల్సింది రూ. 1.48 కోట్లు



కాగజ్‌నగర్, మార్చి 29: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో ఆస్తి పన్ను చెల్లించేందుకు ఈనెల31 చివరి గడువు ఉంది. మున్సిపాల్టీలోని 30వార్డుల్లోని 14,454 గృహాలకు సంబంధించిన ఆస్తిపన్ను, ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను, ఎస్పీఎం, సర్‌సిల్క్‌మిల్లు తాలుకూ ఆస్తి పన్నులు వసూలు చేయాల్సి ఉంది. మొత్తం ఆస్తిపన్ను వసూలు రూ.3.66 కోట్లు ఉండగా, ఇప్పటి వరకు వసూలు చేసింది కేవలం రూ.2.18 కోట్లు మాత్రమే. ఇంకా రూ1.48 కోట్లు వసూలు కావాల్సి ఉంది. రెండునెలల నుంచి సిబ్బంది ఇంటిం టా తిరుగుతూ ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన మేర పన్నువసూలు కావటం లేదు.

ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా రెండ్రోజులు మాత్రమే గడువు ఉండటంతో కమిషనర్ అంజయ్యతోపాటు అధికారులు, సిబ్బంది ఇం టింటా తిరుగుతున్నారు. మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆస్తి పన్నును తప్పకుండా కట్టాలని సూచిస్తున్నారు. ఆస్తిపన్ను కట్టని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆస్తులను కూడా జప్తు చేస్తున్నారు. కుళాయిల నీటి సరఫరాను బంద్ చేస్తున్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఎప్పటికప్పుడు ఆస్తి పన్ను వివరాలపై మానిటరింగ్ చేస్తున్నారు. వంద శాతం లక్ష్యం ఎందుకు చేరుకోలేక పోతున్నామనే విషయంపై జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు.

కాగజ్‌నగర్‌లో కొన్ని సంవత్సరాల నుంచి ఆస్తిపన్ను కట్టని వారి జాబితాను అధికారులు తీశారు. అటువంటివి ఇప్పటి వరకు 30 లక్షల పెండింగ్ ఉన్నట్లు తేలింది. వాటిలో కూలిన పెంకుటిళ్లు, స్థానికంగా లేని వారివి ఉన్నా యి. వాస్తవంగా ఆస్తి పన్ను డిమాండు నోటీసులు పంపించిన సమయంలో స్థానికంగా ఉంటున్నారా..? ఎక్కడుంటున్నారు..? ఆస్తి పన్ను జాబితాలో కూలిన పెంకుటిళ్లు ఉన్నాయా..? అన్న వివరాలను ఇంత వరకు పొందుపర్చలేదు. ఇప్పుడు ఆస్తి పన్ను వందశాతం వసూలులో తేడాలు రావటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒకవైపు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు క్షేత్రస్థాయిలో ఇంటింటా తిరుగుతుండటంతో వాస్తవ విషయాలు బయటకు వస్తున్నాయి.

అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయి. మున్సిపల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలకు కూడా నోటీసులను పంపించారు. బడా బకాయిల విషయంలో కూడా అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సర్‌సిల్క్ లిక్విడేటర్‌కు బకాయిల జాబితాను అందజేశారు. రూ.3కోట్ల మేర ఉందని తేల్చారు. త్వరితగతిన చెల్లించి మున్సిపల్ పురోభివృద్ధికి సహకరించాలని అధికారులు లిక్విడేటర్‌ను కోరారు. త్వరలోనే బకాయిలు చెల్లిననని లిక్విడేటర్ సూచించినట్లు సమాచారం.



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రజలు పన్నులు కట్టి అభివృద్ధికి సమకరించాలి.. అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్



ప్రజలు తప్పకుండా పన్ను కట్టాలి. మరో రెండు రోజులు మాత్రమే చెల్లించేందుకు అవకాశం ఉంది. పన్నులు చెల్లించి మున్సిపల్ పురోభివృద్ధికి సహకరించాలి. ప్రతి ఇంటికి మా సిబ్బంది వస్తున్నారు. తప్పకుండా చెల్లించాలి.

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

● ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

జైనూర్, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ సీటు తప్పక బీఆర్‌ఎస్ గెలిచి తీరుతుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని పార గ్రామంలో శుక్రవారం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వమే బాగుండేదని ప్రజలు చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. బీజేపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. వచ్చే మరి కొద్దిరోజుల్లో గ్రామగ్రామాన తిరిగి ప్రజలకు బీఆర్‌ఎస్ చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీ సీటును సునాయాసంగా కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, యాదవ్‌రావ్, ఊర్వేత ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు

● తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 29: బాల్య వివాహాలు జరిపిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం పర్శనంబాల గ్రామంలో బాల్యవివాహం జరిపిస్తున్నారని సమాచారం అందడంతో సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకొని వివాహన్ని నిలిపివేయించారు. ఈ సందర్భంగా అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులకు బాల్య వివాహం చేయడం వలన కలిగే నష్టాలను వివరిస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారు. యువతికి 18సంవత్సరాల వయస్సు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. ముందుగా చేస్తే ఆరోగ్య సమ స్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. దీంతో 18 సంవత్సరాల వయస్సు నిండిన తరువాత వివాహం జరిపిం చేందుకు ఇద్దరి తల్లిదండ్రులు అంగీకరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్యలక్ష్మి, సీడీపీవో సాదియా రుక్సానా, బాలికల సంరక్షణాధికారి మహేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జోడేఘాట్‌ను సందర్శించిన విద్యార్థులు



జోడేఘాట్‌ను సందర్శిస్తున్న పెంచికలపేట జడ్పీ విద్యార్థులు

పెంచికలపేట, మార్చి 29: పెంచికలపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం పీఎంశ్రీ విద్యావైజ్ఞానిక యాత్రలో భాగంగా కెరమెరి మండలం జోడేఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా భీం విగ్రహంతో పాటు మ్యూజియం, ఆర్కీలు సందర్శించి కుమరంభీం పోరాట పటిమను తెలుసుకున్నారు. గిరిజనుల జీవన విధానం, వారు వాడిన వస్తువుల ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వారికి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు యాదగిరి, శ్రీధర్, గంగాభవానీ, సుజాత, లక్ష్మి, నగేష్, కళావతి, భారతి, సాదియా, సాయి పాల్గొన్నారు.

రేపు మంత్రి సీతక్క పర్యటన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కోనేరు కోనప్ప, జడ్పీ చైర్మన్ కృష్ణారావు

కౌటాల, మార్చి 29: పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో మండల కేంద్రంలో ఈనెల31న నిర్వహించే కార్యకర్తల సమావేశానికి మంత్రి సీతక్క రానున్నట్లు మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. సమావేశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ హాజరవుతారని, అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జుతోపాటు ముఖ్య నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మేరకు మాజీఎమ్మెల్యే కోనప్పతోపాటు జడ్పీ చైర్మన్ కోనేరుకృష్ణారావు, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మనీష్, మాజీ సర్పంచ్ మౌనీష్, నాయకులు రాజేశ్వర్, ప్రకాష్, విలాస్‌గౌడ్, నాజీం హుస్సేన్ ఏర్పాట్లను పరిశీలించారు.



త్వరలో మ్యాన్‌రైడింగ్ అందుబాటులోకి తెస్తాం



మ్యాన్‌రైడింగ్ రోప్ పనులను ప్రారంభిస్తున్న మేనేజర్ లక్ష్మీనారాయణ

కాసిపేట, మార్చి 29: కాసిపేట 2వ గనిలో మ్యాన్‌రైడింగ్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని గని మేనేజర్ లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. ఎరక్షన్ అండ్ ఫ్యాబ్రికేషన్ పనులు పూర్తికావడంతో శుక్రవారం రోప్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనిలో కార్మికులు పని స్థలాల వరకు నడిచి వెళ్లడంతో తీవ్ర అలసటకు గురవుతున్నారన్నారు. దీని వల్ల పరోక్షంగా ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని తెలిపారు. అలాగే కార్మికుల గైర్హాజరు శాతం పెరిగి ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బంది పడుతున్నామన్నారు. వీటిని అధిగమించేందుకు కార్మికుల సౌకర్యం మెరుగు పర్చడం కోసం మ్యాన్‌రైడింగ్ పనులను వేగవంతంగా చేస్తున్నామన్నారు. వచ్చే నెల మొదటి వారంలో మ్యాన్ రైడింగ్ అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రక్షణాధికారి సంతోష్ రావు, అధికారులు రఘు, కృష్ణ ప్రసాద్, కార్మికసంఘాల నాయకులు గోళ్ల శ్రీనివాస్, కారుకూరి తిరుపతి, శ్రీనివాస్, అధికారులు సుభాష్‌చంద్రబోస్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ డిపార్ట్‌మెంట్ పిట్ కమిటీ



నియామక పత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 29: సింగరేణికాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ ఏరియా హెల్త్‌డిపార్ట్‌మెంట్ పిట్‌కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా సమక్షంలో పిట్‌కార్యదర్శిగా విజయలక్ష్మీ, సహాయకార్యదర్శిగా బోయిని రమణ, సంయుక్తకార్యదర్శిగా జి శ్రీనివాస్, చీఫ్‌ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొల్లూరు తిరుపతి, కోశాధికారిగా ముద్దసాని మల్లేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అరుణకుమారి, విజయలక్ష్మీ, మంజుల, నాగేంద్రవర్మ, లింగమూర్తిని ఎన్నుకున్నారు. అనంతరం డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబుకు కమిటీని పరిచయం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్లకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలి

● ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్ తిరుపతి

రెబ్బెన, మార్చి 29: బెల్లంపల్లి రీజియన్‌లో ఈపీ ఆపరేటర్లకు 2022-23కు సంబంధించిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్ తిరుపతి డిమాండు చేశారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. కొత్తగూడెం రీజియన్‌లో ప్రమోషన్లను ఇచ్చేందుకు యాజమాన్యం పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

కానీ బెల్లంపల్లి రీజియన్‌లో ప్రమోషన్లు భర్తీ చేయుటకు యాజమాన్యం ఎన్నికలకోడ్ సాకు చూపిస్తోందన్నారు. ఈ ప్రక్రియకు ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదని అన్నారు. రీజియన్ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వ హించి వెంటనే ప్రమోషన్లు ఇవ్వా =లన్నారు.

సమావేశంలో పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేష్, కిరణ్‌బాబు, దివాకర్, ఆపరేటర్లు గణేష్, మోహన్‌రావు, రారాజు, తిరుపతి, సంతోష్, రవి, ఇర్షాద్ బాబా, ఎండీ ఆజం తదితులు పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

● సీఎండీకి వినతిపత్రం అందజేత

రామకృష్ణాపూర్, మార్చి 29: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని శుక్రవారం తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ సీఎండీ బలరాంకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో దాసరి ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



పెంచికలపేటలో వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

ఆసిఫాబాద్, మార్చి 29: జిల్లాలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జీవితచరిత్ర వివరించారు. ఏసుక్రీస్తు చూపినమార్గంలో అందరు పయనించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలకేంద్రంలోని చర్చిలో క్రైస్తవులు ఏసుక్రీస్తు జన్మదినాన్ని స్మరిస్తూ గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఏసు క్రీస్తు జీవిత విశేషాలను పాస్టర్ ప్రేంకుమార్ బోధించారు.

పెంచికలపేట: ప్రపంచానికి శాంతిసందేశాన్ని ఇస్తూ క్రీస్తు శిలువ నెక్కిన రోజును గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటామని ఫాదర్స్ నైజు మిథున్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెయింట్‌క్లారిటీ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుత సమాజంకోసం సన్మార్గ జీవనాన్ని మానవజాతికి తెలి యజేయడం కోసం శిలువ నెక్కిన క్రీస్తు తనరక్తాన్ని చిందించిన రోజు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతరం చర్చి ఆవరణలో క్రైస్తవులు జీసస్ వేషాధారణలతో భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టి యన్స్ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 29: ఇంటి, వ్యాపార సముదాయాల పన్నులను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని వ్యాపారసముదాయాల్లో సిబ్బందితో కలిసి పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల31 వరకు పన్నులు చెల్లించాలని లేనిపక్షంలో ఏప్రిల్1 నుంచి 20శాతం ఫైన్‌కట్టాల్సి ఉంటుంద న్నారు. ప్రజలుఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ ఆనందం, ఆర్ఐ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారంగపాణి, బిల్ కలెక్టర్ నాగేందర్, వార్డు అధికారి భద్రయ్య, సిబ్బంది వంశీ, ఉదయ్ ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది

ఆసిఫాబాద్, మార్చి 29 టీవీవీపీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లిం చాలని ఏప్రిల్ 1నుంచి చేపట్టే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు దివాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ సీహెచ్‌సీలో ధర్నా నిర్వహించి డాక్టర్ రాణాకు వినతిపత్రం అందజేశారు. వెంటనే శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లేష్, సత్తార్‌బేగ్, లక్ష్మణ్, హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో వడిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్, మార్చి 29: జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, నాయకులు రహెమాన్, భీమేష్, అబ్దుల్లా, ఫయాజ్, అమన్, షైమద్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డుపై ఇరుక్కుపోయిన వాహనాలు



భూసిమెట్ట ఘాట్‌లో నిలిచిపోయిన వాహనాలు

జైనూర్, మార్చి 29: మండలంలోని భూసిమెట్ట ఘాట్ పరిసర ప్రాంతంలో శుక్రవారం వాహనాలు ఇరుక్కు పోయాయి. దీంతో ఈ మార్గంలో రాపోకలకు ఇబ్బందులు కలిగింది. పెద్దవాహనాలు రాకపోకలకు వీలులేకుండా పోవడంతో వాహనాలు నిలిచిపోయ్యాయి. దీంతో సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని రూట్‌ను క్లియర్ చేశారు. భూసిమెట్ట ఘాట్ ప్రాంతంలో రోడ్డు చిన్నగా ఉండడంతో నిత్యం వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతోంది. తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది.



మందుబాబులకు అడ్డాగా
ముత్యంపల్లి పార్కు

కాసిపేట, మార్చి 29: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో పంచాయతీల్లోని నర్సరీలు నిరాదరణకు గురవుతున్నాయి. మండల కేంద్రంలోని ముత్యంపల్లి పార్కును లక్షల రూపాయలు వెచ్చించి అందంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఆ పార్కు మందు బాబులకు అడ్డాగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో రోజు కొందరు యువకులు మద్యంసేవిస్తూ ఖాళీసీసాలను పార్కులో పగలగొడుతున్నారు. దీంతో పార్కులోకి వచ్చేవారి కాళ్లకు గుచ్చుకుని గాయాల పాలవుతున్నారు. సాయంత్రం ప్రేమ జంటలు తిరుగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి పార్కును పట్టించుకోని అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని , ప్రజలకు ఆహ్లాదం పంచేలా పార్కును తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

బోయినపల్లి, మార్చి 29: ఓ వ్యక్తిని ఉపాధి కోసం గల్ఫ్‌కు పంపిస్తానని నమ్మించి డబ్బులు కాజేసి మోసం చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కొండ చిరంజీవి అనే వ్యక్తిని కొనరావుపేట మండలంలోని గోత్రాల ప్రశాంత్ గల్ఫ్ పంపిస్తానని నమ్మించాడు చిరంజీవి వద్ద లక్ష పదివేల రూపాయలను తీసుకొని ప్రశాంత్ మోసం చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ప్రశాంత్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై తెలిపారు.


కన్నుల పండువగా నృసింహుడి రథోత్సవం

● తరలివచ్చిన వేలాది మంది భక్తులు

ధర్మపురి, మార్చి 29: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. అలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూర్ణాహుతి అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీవేంకటేశ్వర, శ్రీ రామలింగేశ్వర స్వామివారల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి రథాలపై ఆశీనులు చేశారు. భక్తులు క్యూలైన్‌ద్వారా వెళ్లి స్వామివారలను దర్శించుకున్నారు.సాయంత్రం స్వామివారల రథాలను క్షేత్రంలోని పురవీధులగుండా ఊరేగించారు.మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారల రథాలను తిరిగి ఆలయం వరకు ఊరేగించారు. అర్చకులు రాత్రివేళలో చక్రతీర్థ స్నానానికై గోదావరినదికి వెళ్లి ప్రత్యేకపూజలు జరిపారు. అనంతరం వధూవరులు ఇరువురికి పుష్పయాగం నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, ఆలయ ఉప ప్రధానఅర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచార్య, రమణచార్య, నరసింహమూర్తి, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, మోహన్, నవీన్, అరుణ్, హరినాథాచార్య, ప్రదీప్‌లు రాత్రి 8గంటలవరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని స్వామి వారలను దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో స్వామివారిని దర్శనం చేసుకున్న ప్రభుత్వ విప్‌ను వేదపండితులు, అర్చకులు ఘనంగా ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీబత్తినిఅరుణ, మున్సిపల్‌కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య మహిళా సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, ఆర్యవైశ్య, వర్తక సంఘాల పట్టణ అధ్యక్షులు మురికి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా

లక్షెట్టిపేటరూరల్, మార్చి 29: రాబోయే పార్లమెంట్‌ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి లక్షెట్టిపేట పట్టణంలో ప్రచారం నిర్వహించారు. దుకాణ సముదాయాలు తిరుగుతూ ఓట్లు వేయాలని కోరారు. గతంలో బీఆర్‌ఎస్‌చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.















చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెన్నూరు, మార్చి 29 : చెన్నూరు పట్టణంలోని గోదావరి చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బజ్జూరి రాజన్న (55) అనే వ్యక్తి గాయపడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చెన్నూరు పట్టణానికి చెందిన రాజన్న, పద్మలు బుధవారం రాత్రి చేనుకు వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తున్నారు. చింతలపల్లి గ్రామానికి చెందిన కదారి సంతోష్ చింతపల్లి నుంచి మోటార్ సైకిల్‌పై చెన్నూర్‌కు వస్తుండగా గోదావరి చౌరస్తా వద్ద రాజన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజన్నకు తీవ్ర గాయాలు కాగా పద్మకు స్వల్ప గాయాలయ్యాయి. రాజన్నను స్థానిక ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ రాజన్న శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేందర్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

నాటుసారా తయారీపై కేసు నమోదు

కోటపల్లి, మార్చి 29 : మండలంలోని రాంపూర్‌లో శుక్రవారం నాటు సారా తయారు చేస్తున్న దూర్కె శంకరయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. గ్రామంలో నాటు సారా తయారవుతుందనే పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించగా శంకరయ్య తయారు చేస్తూ పట్టుబడ్డాడని, ఇతని వద్ద నుంచి 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కోటపల్లి, మార్చి 29: మండలంలోని మల్లంపేటలో శుక్రవారం స్వర్గీయ బయ్యదీక్షిత్ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని మాజీ సర్పంచు సల్పాల పోశంతోపాటు గ్రామస్థులు ప్రారంభించారు. పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులకు చలివేంద్రం ద్వారా దాహార్తి తీరనుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కోండ్ర సుదర్శన్, సురేష్, నాగన్న, రాజేందర్, విష్ణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి చేయూత


వధువుకు పుస్తె, మట్టెలు, దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే

భీమారం, మార్చి 29: మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన అబ్బర్ల లక్ష్మీ-శంకర్ కూతురు మల్లీశ్వరి వివాహానికి కాంగ్రెస్ నాయకులు ఉస్కమల్ల పున్నంచంద్ బ్రదర్స్ చేయూత నందించారు. వధువుకు పుస్తెలు, మట్టెలు, పట్టు వస్త్రాలు అందజేయగా వీటిని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే ఉస్కమల్ల బ్రదర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, పోడేటి రవి, శ్రీనివాస్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

రామకృష్ణాపూర్, మార్చి 29: పట్టణంలోని విద్యానగర్‌లోని మన్నా చర్చిలో నిర్వహించిన వేడుకలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మందమర్రి మాజీ జడ్పీటీసీ సుదర్శన్‌గౌడ్ కుమారుడు సునీల్‌గౌడ్ భార్గవి దంపతులను ఆశీర్వదించారు. మైనార్టీ అధ్యక్షుడు అఫ్జల్ లాడెన్ మాతృమూర్తి అనారోగ్యంతో ఉండగా పరామర్శించారు. పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, రాష్ట్ర కార్యదర్శి పిన్నంటి రఘునాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్ గౌడ్, తేజావత్ రాంబాబు, చంద్రగిరి ఎల్లయ్య, మెట్ట సుధాకర్, మొకనపల్లి రామకృష్ణా, పలిగిరి కనకరాజు, బత్తుల వేణు , వెంకట్ రెడ్డి, రాం సాయి, కుర్మ మహేందర్, గూడ సత్తయ్య, మహిళ నాయకురాళ్ళు శారద, దీప, కమల పాల్గొన్నారు.

తిరుమల సుప్రభాత సేవలో ఎమ్మెల్యే

బెల్లంపల్లి, మార్చి 29 : బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానంలో సుప్రభాత సేవలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ప్రజలందరు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేశారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన రహదారి నిర్మాణం

తేలిన కంకరతో ప్రయాణికుల ఇబ్బందులు

నస్పూర్, మార్చి 29: నస్పూర్ మున్సిపాలిటీలోని వెంకటేశ్వర ఆలయం నుంచి రాయల్ ఫంక్షన్ హాల్ వరకు నిర్మించ తలపెట్టిన రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పాత బీటీ రోడ్డును కొంత దూరం తవ్వి వెడల్పు చేసే పనులు ప్రారంభించారు. కంకర వేసి నాలుగు నెలలకు పైగా గడుస్తున్నప్పటికీ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో కంకర రోడ్డుపై ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు నాలుగు వందల మీటర్ల పొడవునా రోడ్డు వెడల్పు తోపాటు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.50 లక్షలు విడుదలయ్యాయి. నిధులు రావడంతో పనులు మొదలు పెట్టి ఇది వరకు ఉన్న బీటీని తొలగించారు. పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలి పెట్టడంతో తేలిన కంకరతో వాహనాలు చోదకులు అవస్థలు పడుతున్నారు.


రోడ్డుపై తేలిన కంకర

దుమ్ముతో ఇబ్బందులు...

నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీ, నాగార్జున కాలనీ, న్యూ నాగార్జున కాలనీలకు చెందిన సింగరేణి కార్మికులు విధులు నిర్వహణకు ఈ రోడ్డు మార్గం ద్వారానే ప్రయాణిస్తారు. కంకర తేలిన రోడ్డుపై వెళ్ళుతున్న సమయంలో ద్విచక్ర వాహనం టైర్లకు కంకర రాళ్ళు గుచ్చుకుని పంచర్లు అవుతున్నాయి. వాహనాలు వెళ్ళిన సమయంలో విపరీతమైన దుమ్ము లేస్తోంది. సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాక పోవడంతో ఇదే రోడ్డు పక్కన మంగళ, శనివారాల్లో రెండు రోజుల్లో వారసంత జరుగుతుంది. రోడ్డు పక్కనే చిరు వ్యాపారులు వివిధ రకాల అమ్మకాలు చేయడం, రోడ్డుపై ప్రయాణించే వాహనాలతో దుమ్ముధూళి తో వ్యాపారులు, వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా కంకర తేలిన రోడ్డు పై ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కింద పడడంతో గాయాలకు గురైనా సంఘటనలున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

బెల్లంపల్లి, మార్చి 29: బెల్లంపల్లి పట్టణంలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జెండాను ఆవిష్కరించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మణిరాంసింగ్, జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మల్లయ్య, రమేష్, హసన్, యాదగిరి, రమేష్‌పాండే, కుమార్, గంగాధర్‌గౌడ్, వెంకటేష్, శంకరయ్య, గణేష్‌నర్సింగ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ టీడీ పీ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ సెంటర్‌లో టీడీపీ జెండాను ఆవి ష్కరించి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. నాయకులు ఉమామహేశ్వర్‌రావు, వాసాల సంపత్, జయ, సంధ్య, రాజేష్, హకీం, తిరుపతిరెడ్డి, సావిత్రి, మధు, తదితరులు పాల్గొన్నారు.


మందమర్రిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీరాంపూర్: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసమే పుట్టిన పార్టీ టీడీపీ అని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తలారి రాజు అన్నారు. టీడీపీ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం శ్రీరాంపూర్‌లో నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల కోసమే నేటికీ పని చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో పూర్వ వైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు గరిగంటి రాజయ్య, రవి, కొట్ల సత్తయ్య, గరిగంటి శివ కుమార్, వడ్లకొండ వెంకన్న, కృష్ణ, రవి, వెంకటేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన చెట్లు



కాసిపేట, మార్చి 29 : రోడ్డు పక్కన ఉన్న పచ్చని చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. కాసిపేట 2వ గనికి వెళ్లే రహదారికి ఇరువైపులా సింగరేణి అధికారులు చెట్లను నాటారు. అందం, ఆహ్లాదంతో పాటు చల్లని నీడనిచ్చే చెట్లు మంటల్లో కాలిపోయాయి. రైతు పత్తిచేనులో నిర్లక్ష్యంగా చెత్త కుప్పలను తగలబెట్టడంతో మంటలు ఎగిసిపడి చెట్లు కాలిపోయాయి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండుటెండలో.. చెట్ల నీడన...



దండేపల్లి, మార్చి 29: మంచిర్యాల-ఆదిలాబాద్- నిర్మల్ ప్రధాన రహదారి మార్గంలో దండేపల్లి మండలంలోని తాళ్ళపేట మొదలు ముత్యంపేట వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా గల మహా వృక్షాలు ప్రయాణికులకు నీడ నిస్తున్నాయి. వేసవికాలంలో ఏపుగా పెరిగిన మహా వృక్షాలు ప్రయాణికులకు రక్షణనిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపుల అల్లుకుని ఉన్న వృక్షాల కింద ప్రయాణికులు కాసేపు సేద తీరుతున్నారు. మండే ఎండలో చల్లదనాన్ని అందిస్తున్నాయి.

ఎస్ఎంసీలకు బదులుగా ఏపీసీలు



- సర్కార్ బడుల నిర్వహణకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ
- మహిళా సంఘాలకు పర్యవేక్షణ బాధ్యత
- ఎస్‌హెచ్‌జీల్లోని ముగ్గురు సభ్యులతో కమిటీలు

వాంకిడి, మార్చి 29: ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కోసం గతంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (ఎస్ఎంసీ) ఉండేవి. వాటిని ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగియనుంది. నిధుల వినియోగానికి పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడు, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి కలిపి చెక్ పవర్ కల్పించింది. రద్దు చేసిన ఎస్ఎంసీ స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏపీసీ)లుగా రూపాంతరం చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారం క్రితమే రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయగా జిల్లాలో కమిటీల ఎన్నిక ప్రక్రియ కొనసాగుతోంది.

మహిళా సంఘాలకు బాధ్యత

ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని బడుల పర్యవేక్షణలో మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములు చేసేందుకు చర్యలు చేపట్టింది. మౌలిక వసతుల కల్పన, పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలు వీరికి అప్పగించేందుకు నిర్ణయం తీసుకుంది. కమిటీలు పర్యవేక్షించే, నిర్వహించే పనులను ఎంవోఎంటీ సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్‌లో జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సాంకేతిక సంస్థల అధికారులు చూడనున్నారు.

ఎస్‌హెచ్‌జీల్లోని ముగ్గురు సభ్యులతో..

ఒకటి నుంచి పదవతరగతి వరకు చదివే విద్యార్థుల్లో ముగ్గురు విద్యార్థుల తల్లులను సభ్యులుగా తీసుకుంటారు. వీరు తప్పనిసరి స్వయం సహాయకసంఘాల్లో(ఎస్ఎచ్‌జీ) సభ్యులై ఉండాలి. బడి సమీపంలో మహిళాసమాఖ్య అధ్యక్షురాలిని కమిటీ అధ్యక్షురాలిగా నియమిస్తారు. ఏటా రొటేషన్ ప్రాతిపదికన కమిటీల నియామకాలు జరుగుతాయి. ముగ్గురిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ అయి ఉండాలి.

సేవా రుసుము...

బడిలో తాగునీటి మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుధ్యం, ఏకరూప దుస్తులు కుట్టడం బాధ్యతను ఈ కమిటీలు పర్యవేక్షిస్తాయి. పనుల కోసం ఉపాధిహామీ, ప్రత్యేకాభివృద్ధి నిధులతోపాటు ఇతర సంస్థలు ఇచ్చేవి వీటికి వెచ్చించాలని నిర్ణయించారు. నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించి ఆయాపనుల విలువలో మూడుశాతం సేవా రుసుముల కింద కమిటీలకు చెల్లించాలని సూచించారు. అత్యవసరమైన పనులు వచ్చే జూన్ 10 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అధ్యక్షురాలితోపాటు ప్రధానోపాధ్యాయుడికి కలిపి బ్యాంకు ఖాతా తెరిచి, ఉమ్మడి చెక్‌పవర్ కల్పించనున్నారు.

రూ.25వేలు మించితే టెండర్

పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనుల్లో రూ.25వేల లోపు కమిటీ తీర్మానంతో చేసుకోవచ్చు. అంతకంటే పైన ఉంటే పాఠశాల కమిటీలు జిల్లా సమాఖ్యలతో కలెక్టర్‌కు నివేదించాలి. ఏఈ, డిప్యూటీ ఈఈలు పనులకు సంబంధించిన రికార్డును ఎంబుక్‌లో నమోదు చేయాలి. పనులు రూ.లక్ష దాటితే జిల్లా కలెక్టర్‌తో చెల్లిస్తారు. సామాజిక తనిఖీ సంస్థను పాఠశాల విద్యా కమిషనర్ ఎంపిక చేస్తారు. కార్యక్రమం పర్యవేక్షణకు మొత్తంలో మూడుశాతం మేరకు సాఫ్ట్‌వేర్, శిక్షణ, ఇతర ఖర్చుల కోసం వెచ్చించే వెసులుబాటు కల్పించారు.

కొత్త ఖాతాలు తెరిచేందుకు చర్యలు..: మనుకుమార్, ఎంఈవో



అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల నియామకం 90శాతం పూర్తి అయింది. కమిటీలకు నూతన బ్యాంకు ఖాతాలు తీసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పదవ తరగతి పరీక్ష తరువాత పూర్తిస్థాయిలో కమిటీల ఏర్పాటు పూర్తిచేస్తాం. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతోనే పాఠశాలల నిర్వహణ కొనసాగుతుంది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ సాదిక్ పాషా

చింతలమానేపల్లి, మార్చి 29: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని సీఐ సాదిక్‌పాషా అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్, కోర్సిని, బూరెపల్లి, రన్‌వెల్లిగ్రామాల్లో సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గబేధాలు లేకుండా అల్లర్లుజరగకుండా ప్రజలంతా సహక రించాలన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి యుతంగా ఎన్నికలు జరిగేలా పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. అంతకుముందు సాయుధ బలగాల కవాతును సీఆర్పీఎఫ్ కమాండెంట్ జెండా ఊపి ప్రారం భించారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

బైండోవర్ అతిక్రమిస్తే జైలుకే

వాంకిడి, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో శాంతిభద్రతల విఘాతానికి దారితీసే అంశాలపై పోలీసులునిఘా పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో బైండోవర్, రౌడీషీట్, బౌండ్‌డౌన్ అంటే ఏమిటీ...? హామీలను ఉల్లంఘిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారనే వాటిపై వివరాలు..

బైండోవర్ అంటే..

ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు, పాతనేరస్థులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని గత ఎన్నికల సమయంలో కొట్లాటలతో సంబంధం ఉన్నవారిని, గొడవలు సృష్టించే అవకాశమున్న వ్యక్తులను తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు. చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో కలుగజేసు కోమని వారి నుంచి లిఖితపూర్వక హామీ తీసుకుంటారు. ఒక్కొక్కరితోగరిష్ఠంగా రూ.2లక్షలకు బాండ్‌పేపర్ రాయించుకొని సొంత పూచీకత్తుపై.. అవసరమైతే మరొకరి పూచీకత్తు తీసుకుంటారు. ఈ ప్రక్రియను సత్ప్రవర్తన హామీ(బైండోవర్) అంటారు. బైండోవర్ చేయడమంటే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయరు. వారిని కోర్టులో హాజరుపరచరు. హామీ ఉల్లంఘిస్తే మాత్రం కేసు నమోదుచేస్తారు. బైండోవర్ పత్రాలు ఆరునెలల పాటు పోలీసుల వద్ద ఉంటాయి.

బౌండ్ డౌన్ అంటే?

బైండోవర్ సమయంలో నేరచరితులు, అనుమానితులు శాంతిభద్రతల విఘాతానికి పాల్పడే అవకాశమున్నవారు బాండ్‌లో రాసిచ్చిన హామీని ఉల్లంఘిచడాన్ని బౌండ్ డౌన్ అంటారు. బైండోవర్ అయిన వ్యక్తి ఆర్నెల్లలో చట్ట ఉల్లంఘ నలకు పాల్పడితే గంటల్లో అరెస్టు చేస్తారు. బాండ్ విలువకు సమానమైన మొత్తాన్ని అతని నుంచి వసూలు చేస్తారు. అతను చెల్లించని పక్షంలో పూచీకత్తు ఇచ్చిన వ్యక్తి నుంచి తీసుకొని రాష్ట్ర ఖజానాకు పంపిస్తారు.

రౌడీ షీట్..

తరచూనేరాలు, హత్యలు చేయడం, అల్లర్లుసృష్టించడం,దౌర్జన్యాలకు పాల్పడటం వంటి వారిపై రౌడీషీట్ తెరుస్తారు. నేరచరితులపై నిఘా ఉంచాలని భావిస్తే స్థానిక పోలీసులు రౌడీషీట్ తెరుస్తారు.

తహసీల్దార్ ఎదుట హాజరు..

తహసీల్దార్ మండల పరిధిలో రెవెన్యూ అధికారిగా, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తారు. దీంతో పోలీసులు బైండోవర్ చేసే సమయంలో తహసీల్దార్ ఎదుట హాజరుపరుస్తారు. తీవ్రతను బట్టి ఆర్డీవో ఎదుట హాజరుపరిచే అవకాశం ఉంది. బైండోవర్ తర్వాత ఆ వ్యక్తి ప్రవర్తనలో మార్పురాకపోతే చట్టపరమైన చర్యలు తీసు కొని జైలుకు పంపించే అధికారం వీరికి ఉంటుంది.

బీజేపీకి సూక్ష్మ విరాళాలను అందజేయాలి

● జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 29: బీజేపీకి సూక్ష్మ విరాళాలను అందించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ప్రధానిమోదీ పిలుపు మేరకు రూ.5నుంచి రూ.2వేల వరకు విరాళం ఇచ్చేందుకు ప్రత్యేకయాప్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పట్టణ, మండలాలకు సంబంధించిన ప్రతికార్యకర్త తమవంతుగా తోచిన సహాయం అందించాలన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో తప్పకుండా బీజేపీ అభ్యర్థికి ఓటేసి గెల్పించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి దోని శ్రీశైలం, ఉపాధ్యక్షుడు చన్నపురి గణపతి, తాలుకా కన్వీనర్ వీరభద్రాచారి, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతన వెతలు

చింతలమానేపల్లి, మార్చి 29: అయిదునెలలుగా వేతనాలు రాకపోవడంతో అనేకఇబ్బందులు పడుతున్నామని మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలను వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. మండలంలోని గ్రామపంచాయతీలో సుమారు 70మంది మల్టీపర్పస్ వర్కర్లు పనిచేస్తున్నారు.

ప్రమాదకరంగా.. రోడ్డుపై కంకర కుప్పలు


రోడ్డుపై ఉన్న కంకర కుప్ప

బెజ్జూరు, మార్చి 29: బెజ్జూరు-డబ్బా ప్రధాన రహదారిపై వేసిన కంకర కుప్పలతో ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై కాంట్రాక్టర్ కంకరవేయడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రంగాపూర్ ఎక్స్‌రోడ్, డబ్బాగూడ ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డుపనుల నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా కంకర వేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణించే ద్విచక్రవాహనదారులు ప్రమాదం ఎక్కువ ఉంది. బుధవారం రాత్రి కుకుడ గ్రామానికి చెందిన నక్క గణేష్ అనే యువకుడు ఇంటికి వస్తున్న క్రమంలో రంగాపూర్ వద్ద రోడ్డుపై వేసిన కంకరపై అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యాడు. అధికారులు స్పందించి ప్రాణ నష్టం జరగక ముందే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీ నారాయణను సంప్రదించగా వెంటనే కంకర కుప్పలను చదును చేయిస్తామని తెలిపారు.

కాగజ్‌నగర్‌లో టీడీపీ ఆవిర్భావ వేడుకలు

కాగజ్‌నగర్, మార్చి 29: కాగజ్‌నగర్‌లో శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పార్టీ జెండాను ఆదిలాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు గుళ్లపల్లి ఆనంద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గుల్లపల్లి లావణ్య, సౌభాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటలో కార్డన్ సెర్చ్

సిర్పూర్(టి), మార్చి 29: మండలంలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లలో తనిఖీలు నిర్వహించి 15లీటర్ల గుడుంబాను స్వాధీన పర్చుకున్నారు. అదేవిధంగా 15ద్విచక్ర వాహనాలకు సంబంధించిన పత్రాలు, నెంబరు ప్లేట్లు లేకపోవడంతో జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో యువత వ్యసనాలకు అలవాటు పడకుండా విద్య, వైద్యం, గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ సాదిక్ పాషా, ఎస్సై దీకొండ రమేష్, ఏఎస్సై రాములు, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ ఫీజును తగ్గించాలి

వేమనపల్లి, మార్చి 29 :రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టెట్ ఫీజును తగ్గించాలని ఓయూ జేఏసీ నాయకులు దుర్గం మల్లేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగులు హాస్టల్ ఫీజులు, శిక్షణ, బుక్స్ కోసం వేల రూపాయలు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. టెట్ ఫీజు ఒక్కో పేపర్‌కు వెయ్యి రూపాయలు నిర్ణయించడం సరైంది కాదన్నారు. నిరుద్యోగులపై ఆర్థికభారం పడుతుందన్నారు. వెంటనే ఫీజులను తగ్గించాలని కోరారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	6:31	శనివారం
సహర్	4:49	ఆదివారం



444 ఎకరాల్లో పంట నష్టం

- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- ఎకరాకు రూ.10 వేలు ప్రకటించిన ప్రభుత్వం
- ఎన్నికల కమిషన్ అనుమతిస్తే ఖాతాల్లో జమ

మంచిర్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరాకు రూ.10 వేలు బాధిత రైతులకు ఇచ్చేందుకు పంట నష్టం అంచనా వేయాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ వర్షాలు కురవడంతో చేతికొచ్చిన పంట చేజారింది. బాధిత రైతులకు పరిహారం చెల్లించడం ద్వారా అన్నదాతలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పరిహారం అందజేసేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పరిహారం చెల్లింపులకు అడ్డంకిగా మారింది. రైతులను ఆదుకోవాలనే సదుద్దేశ్యంతో తీసుకున్న నిర్ణయం కావడంతో ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చే అవకాశాలున్నాయి.

19 గ్రామాల్లో పంట నష్టం...

ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన వ్యవసాయశాఖ ఎట్టకేలకు నష్టం అంచనా వేసి, సంబంధిత రిపోర్టును ప్రభుత్వానికి పంపేందుకు సమాయత్తం అవుతోంది. అకాల వర్షాలు, ఈదురు గాలులకు జిల్లా వ్యాప్తంగా 19 గ్రామాల పరిధిలో 444 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. జిల్లాలో ప్రధాన పంటలైన వరి, మొక్కజొన్న, నువ్వులు, తదితర 243.26 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రధానంగా జిల్లాలోని ముగ్గురు రైతులకు చెందిన 4.37 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా రూపొందించారు. అలాగే 365 మంది రైతులకు చెందిన 238.29 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లగా, ఇతర పంటలు దాదాపు 200 ఎకరాల్లో నష్టపోయినట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలి

లగిశెట్టి రాజమౌళి, రైతు గుడిపేట



వర్షాల కారణంగా నష్టపోయిన పంటకు ప్రభుత్వం నిర్ణయించిన మాదిరిగా కాకుండా ఎకరాకు కనీసం రూ.20 వేలు చెల్లించాలి. గింజ దశలో ఉన్న వరి నేలకొరిగింది. ఒక్కసారి నేల కొరిగిన వరి మళ్లీ కోలుకునే పరిస్థితులు ఉండవు. కింద పడిందంటే గింజ తయారు కాదు. దీంతో పంటను మొత్తం కోల్పోవలసిందే. వేలల్లో పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించినదంతా వర్షం పాలైంది.

కాలుష్యం కోరల్లో గ్రామాలు



దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ

- సిమెంట్ కంపెనీతో నష్టపోతున్న ప్రజలు
- కిడ్నీ సంబంధిత వ్యాధితో 3 ఏళ్లలో 15 మంది మృతి
- కలుషితమవుతున్న భూగర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు



వాగులో కలుస్తున్న కలుషిత నీరు

కాసిపేట, మార్చి 29: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ నుంచి వెలువడుతున్న దుమ్ము ప్రభావిత గ్రామాలపై విషాన్ని చిమ్ముతోంది. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతుండగా కంపెనీ వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. మహేంద్ర బస్తీ, స్వీట్ హౌజ్ ఏరియా, లోడింగ్ గడ్డ, శ్రామికనగర్, రాంపూర్ ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఓరియంట్ కంపెనీలో ఫార్మా వేస్టేజ్‌ను బొగ్గులో కలుపుతున్నారు. అలాగే కిలన్‌లో వేడి పుట్టించేందుకు చెడిపోయిన టైర్ల రబ్బర్లను పొడి చేసి బొగ్గుతో కలిపి వినియోగించడంతో కార్మికులు శ్వాసకోశ, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గడిచిన 3 ఏండ్లలో అధికారిక లెక్కల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధితో 15 మంది కార్మికులు నాలుగు పదుల వయస్సులో మృతి చెందడం ఆందోళనకు గురి చేస్తోంది.

కలుషితమవుతున్న భూగర్భ జలాలు

ఓరియంట్ కంపెనీలో వాటర్ ఫిల్టర్‌లను శుద్ధి చేసేందుకు రోజుకు 15 క్వింటాళ్ల ఉప్పును వాడుతున్నారు. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాలు తోడై కాలువల ద్వారా శ్రామికనగర్ సమీపంలోని వాగులోకి చేరుతున్నాయి. ఆ నీటిని ఉపయోగించడంతో చర్మంపై బొబ్బలు వస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ నుంచి వెలువడే దుమ్ముధూళితో పంటలు సరిగ్గా పండక పోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

3 ఏళ్లలో 15 మంది కార్మికులు మృతి

సిమెంటు ఉత్పత్తిలో భాగంగా ఓరియంట్ యాజమాన్యం విషపూరితమైన రసాయనాలను వాడుతుందనే ఆరోపణలున్నా యి. నిషేధిత రసాయనాల వినియోగం వల్ల కార్మికులు వ్యాధుల బారిన పడి మృత్యువాతకు గురవుతున్నారు. గడిచిన 3 ఏండ్లలో 15 మందికి పైగా కార్మికులు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతూ మృతి చెందడం ఇక్కడి కాలుష్య తీవ్రతను తెలియజేస్తోంది.

గిరిజన గూడాల్లో విస్తరిస్తున్న క్షయ

ఓరియంట్ సిమెంట్ కంపెనీ నుంచి వెలువడే దుమ్ముధూళితో ప్రజలు క్షయ వ్యాధి బారిన పడుతున్నారు. కాసిపేట పీహెచ్‌సీలో నమోదైన క్షయ వ్యాధి బాధితులు 55 మంది ఉండగా 20 మందికి పైగా దేవాపూర్ పరిసర ప్రాంతాల వారు ఉండడం గమనార్హం. పెద్దాపూర్, ఇప్పలగూడెం, తుడుంగూడెం, గట్రావుపల్లి, దేవాపూర్, మద్దిమాడ, పెద్దగూడలో ఇప్పటికి చాలా మంది టీబీ వ్యాధి బారిన పడి మంచాలకే పరిమితమయ్యారు. ఇప్పలగూడలో ఒకే కుటుంబంలో ఆరుగురు క్షయ వ్యాధి బారిన పడితే ఇందులో ఐదుగురు మృతి చెందారు. పెంద్రం లింగు, పార్వతిబాయి దంపతులతో పాటు కొడుకు, కోడలు పెంద్రం రాంచందర్, భారతి, కొడుకు పెంద్రం ఇస్రులు మృతి చెందారు. ఇదే కుటుంబంలో పెంద్రం బాదు క్షయ వ్యాధితో బాధపడుతూ మృత్యువుతో పోరాడుతున్నాడు. ప్రభావిత గ్రామాల్లో వైద్య సేవలందించి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ఓరియంట్ సిమెంట్ కంపెనీ గిరిజన గూడాలను నిర్లక్ష్యంగా వదిలేసింది. గిరిజనులు ఆందోళనలు, నిరసనలు చేపట్టినప్పుడు మాత్రమే యాజమాన్యం స్పందించి సీఎస్ఆర్ నిధుల నుంచి కొన్ని సామాజిక కార్యక్రమాలు చేపడుతుంది. దీంతో ఎవరికి న్యాయం జరగడం లేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిరిజన గూడాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు వైద్య సదుపాయం అందించాలని పలువురు కోరుతున్నారు.



లారీలో తరలిస్తున్న రబ్బర్ పౌడర్

క్షయవ్యాధితో కుటుంబాన్ని పోగొట్టుకున్నా

పెంద్రం బాదు , ఇప్పలగూడెం



క్షయ వ్యాధితో కుటుంబాన్ని పోగొట్టుకున్నా. ఇంట్లో ఆరుగురికి టీబీ వ్యాధి సోకింది. 3 ఏండ్లలో ఐదుగురు చనిపోయారు. నేను కూడా క్షయ వ్యాధితో బాధపడుతున్నా. కుటుంబం మొత్తం చని పోవడంతో నన్ను పట్టించుకునే వారే లేరు. డాక్టర్లు వచ్చి మందు లు ఇస్తున్నారు కానీ తగ్గడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

పనిలేక పస్తులుంటున్నాం

పంద్రం దిందర్‌షా , తుడుంగూడెం



కంపెనీ నుంచి వచ్చే దుమ్ముధూళితో పంటలు దెబ్బతింటున్నా యి. 20 సంవత్సరాల నుంచి మా పరిస్థితి ఇలాగే ఉంది. కూలీ సైతం దొరకడం లేదు. దీంతో ఒక్కోసారి పస్తులుండాల్సి వస్తుంది. కంపెనీలో జరిగే బ్లాస్టింగ్ వల్ల భూములు, ఇండ్లు దెబ్బ తింటున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కంపెనీ హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బాధిత గిరిజన గూడాల్లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి.

ప్రజా వ్యతిరేక పార్టీలను ఓడించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

శ్రీరాంపూర్, మార్చి 29 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించే పార్టీలను ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య కోరారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీని రాబోయే ఎన్నికల్లో ఓడించాలన్నారు. దీనికి ప్రజలు సన్నద్ధం కావాలని కోరారు. జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ, జిల్లాలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, జిల్లా యంత్రాంగం త్వరగా స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే బస్టాండ్‌లు, వివిధ కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉద్యోగుల విధుల సమయాన్ని మార్చాలని కోరారు. పార్టీ కార్యవర్గ సభ్యులు రాజేశ్వరి, ప్రకాష్, నాయకులు చందు, శ్రీనివాస్, రంజిత్ కుమార్, రాజారాం, అశోక్, ఉమారాణి, సమ్మక్క, నగేష్, రమేష్, ఎల్లయ్య, రాజలింగు, శ్రీకాంత్, దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి



మాట్లాడుతున్న తపస్ నాయకులు

చెన్నూరు, మార్చి 29: పెండింగ్ బిల్లులను ఈనెల ఆఖరులోగా వెంటనే చెల్లించాలని తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూరులోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన తపస్ డివిజన్ స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు పీఆర్‌సీ ఏరియర్స్ బిల్లులు, డీఏ ఏరియర్స్, జీపీఎఫ్ రుణాల బిల్లులు, సరెండర్ లీవు బిల్లులు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. అలాగే విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, జీవో 317 ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్, నాయకులు సత్తిరెడ్డి, తిరుపతి, శ్రీకాంత్, భాగ్యలక్ష్మీమహేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రం అందుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 29 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన మధుసూదన్‌రెడ్డికి శుక్రవారం హైద్రాబాద్‌లోని రాష్ట్ర శాఖ కార్యాలయంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కోటిరెడ్డి నియామక పత్రం అందజేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అనేక సమాజ హిత సేవా కార్యక్రమాలు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

బీఎస్పీ జిల్లా కార్యవర్గం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 29: బీఎస్పీ జిల్లా కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లాప్రధాన కార్యదర్శిగా రమేష్‌చంద్ర, ఉపాధ్యక్షుడిగా మెరుగు నరేందర్, కోశాధికారిగా నామసామి కుమార్‌లను ఎన్నుకున్నారు. వీరికి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, ఇన్‌చార్జి బోస్‌లు నియామక పత్రాలను అందించారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి



ప్రచారంలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

మందమర్రిటౌన్, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని, ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే బీఆర్ఎస్‌ను గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణి పాఠశాల మైదానంలో మార్నింగ్ వాక్ చేస్తూ బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. యోగా కేంద్రానికి వెళ్లి యోగా చేశారు. వారు మాట్లాడుతూ ఆచరణలో సాధ్యం కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. గతంలో కుటుంబపాలన అని మాట్లాడిన వారు బెల్లంపల్లి నుంచి చెన్నూరు వరకు కుటుంబ పాలన నడుస్తుందని ప్రజలు గమనించాలన్నారు.అక్రమ కేసులు పెడుతూ ప్రతిపక్షాలను బీజేపీ, కాంగ్రెస్‌లు భయపెడుతున్నాయన్నారు. మార్కెట్ సెంటర్‌లో ప్రచారం చేశారు. నాయకులు కొంగల తిరుపతిరెడ్డి, సంపత్, మేడిపల్లి సంపత్, అబ్బాస్, నూరిబాబు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం



మందమర్రిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మార్చి 29 : పెద్దపల్లి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీతో కలిసి పట్టణంలో ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల పోరాటాలు, విద్యార్థుల బలిదానాలతో సాధించుకున్న రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కుంభకోణాలే లక్ష్యంగా ముందుకు సాగిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని మర్చిపోయిందని, దీంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. కల్వకుంట్ల కుటుంబం చేయని స్కాంలు లేవని, ఈ స్కాంల నుంచి వారు బయటపడరని తెలిపారు. వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. అభ్యర్థి వంశీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని, తాత, తండ్రి, పెద్దనాన్న ప్రజలకు సేవలందిస్తారో తాను కూడా సేవలందిస్తానని తెలిపారు. నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం యేసుక్రీసు ప్రాణత్యాగం



చెన్నూరులో యేసుక్రీస్తు సిలువ వేస్తున్న దృశ్యం, మంచిర్యాలలో యేసు సిలువతో క్రిష్టియన్ల ర్యాలీ

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 29: యేసుక్రీస్తు శాంతి సౌభ్రాతృత్వం, లోక కల్యాణం కోసం ప్రాణత్యాగం చేశారని క్యాథలిక్ చర్చి ఫాదర్, ఆదిలాబాద్ మిత్రాసనం పీఠాధిపతి ప్రిన్సి ఆంటోని, ఫాదర్ జోష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని క్రిస్టియన్‌లతో కలిసి సిలువ యాత్రను బెల్లంపల్లి చౌరస్తా నుంచి లక్ష్మీటాకీస్ చౌరస్తా వరకు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మానవుల రక్షణ కోసం యేసుక్రీస్తు సిలువపై మరణం పొంది తిరిగి మరణాన్ని జయించి లోకానికి నిత్య జీవనాన్ని ప్రసాదించి శాంతి సందేశం అందించారన్నారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మణికేతన్,యోహాన్ పాల్గొన్నారు.

జైపూర్: ఇందారం, ముదిగుంట, జైపూర్, టేకుమట్ల, కుందారం, వేలాల, పౌనూరు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏసుక్రీస్తు ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు లోక రక్షకుడని ప్రపంచంలోని ప్రజలందరి పాప పరిరక్షణ కోసం సిలువలో బలియాగమయ్యారని జ్ఞాపకం చేసుకున్నారు. క్రిస్టియన్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. రోమన్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో సిలువ మార్గమును ఏర్పాటుచేశారు. యేసుప్రభువు వేషధారణలో సిలువ మోస్తూ యాత్ర నిర్వహించారు. చర్చి ఫాదర్లు, పాస్టర్లు ఏసుప్రభువు జీవిత చరిత్రను సిలువలో నిద్రించిన తీరును క్రైస్తవులకు వివరించారు. ఫాదర్, పాస్టర్లు రాజేష్, తిమోతి, దిలీప్, పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. తెల్లవారుజామున క్రైస్తవులు ఆయా చర్చిలో ప్రార్థనలు ఆరాధన పూజలను నిర్వహించారు. పాస్టర్లు యేసుక్రీసు సందేశాలను చదువుతూ, ప్రత్యేక పార్థనలు, యేసుక్రీసు పాటలు పాడారు.

కాసిపేట: మల్కేపల్లి, దర్మారావుపేట, దేవాపూర్, కొండాపూర్ యాప, కాసిపేట, ముత్యంపల్లి, సోమగూడెంలలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు ఉదయమే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తును సిలువ వేసిన విధానాన్ని వివరించారు.

చెన్నూరు: చెన్నూరు సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ యేసుదాస్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. క్రైస్తవులు క్రీస్తు నామస్మరణ చేస్తూ ఆటాపాటలతో భక్తి పారవశ్యంతో యేసును కొనియాడారు. పాస్టర్లు కళ్యాణ్, దేవదాస్, స్టీవర్డ్, శంకర్, శామ్సన్, పోచన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎస్ఐ చర్చిలో జరిగినవేడుకల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాస్టర్ రెవరెండ్ జెర్మియా ఆధ్వర్యంలో సిలువపై యేసు పలికిన మాటలను ధ్యానించి ఏసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకున్నారు.



దండేపల్లి చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్, భీమారంలో యేసు సిలువతో ర్యాలీ